నేడు 'పిఠాపురం చరిత్ర' పుస్తకావిష్కరణ

ర్యాలి ప్రసాద్

ప్రజాశక్తి - పిఠాపురం

పిఠాపురానికి చెందిన ప్రముఖ కవి, రచయిత ర్యాలి ప్రసాద్ రచించిన 'పిఠాపురం చరిత్ర' పుస్తకాన్ని గురువారం పిఠాపురం పట్టణంలో ఒక ప్రైవేటు స్కూల్లో ప్రముఖులు ఆవిష్కరించనున్నారు. చారిత్రాత్మక, ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న 'పిఠాపురం'.. ఒకనాడు పీఠికాపురం పేరున చరిత్ర గాంచింది. ఇక్కడే అష్టాదశ శక్తిపీఠంగా పురుహూతికా దేవి, కుక్కుటేశ్వర స్వామి, కుంతీ మాధవస్వామి, శ్రీపాద శ్రీవల్లభులు ఆలయాలు కల ఈ పిఠాపురాన్ని ఎన్నో రాజకుటుంబాలు పాలించాయి.భారతదేశాన్ని సందర్శించిన విదేశీ యాత్రికులంతా పిఠాపుర కీర్తిని పలు సందర్భాల్లో ప్రస్తావించారు. అనంతరం మొఘల్, నిజామ్ ప్రభుత్వ పాలన నాటికి తన ప్రాభవాన్ని కోల్పోయింది. ఘన చరిత్ర కలిగిన పిఠాపురం చరిత్రను మరింత లోతుగా అధ్యయనం చేసిన ర్యాలీ ప్రసాద్‌ను ఈ సందర్భంగా గురువారం పలువురు ఘనంగా సత్కరించనున్నారు.

జెసి ఇలాక్కియా, కలెక్టర్ కృతికా శుక్లాతో కలసి సమావేశంలో మంత్రి రాజా,

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

- మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాలు

ప్రజాశక్తి - కాకినాడ

నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద తుని నియోజకవర్గంలో చేపట్టిన గృహ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర మంత్రి దాడిశెట్టి రాజా, కలెకట్టర్ కృతికా శుక్లా, జెసి ఎస్. ఇలాక్కియా, హౌసింగ్, రెవెన్యూ, డ్వామా, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో కలిసి తుని నియోజకవర్గ పరిధిలో గృహ నిర్మాణాలు, ఉపాధి హామీ పథకం, జల్ జీవన్ మిషన్ తదితర పథకాలలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. కోటనందూరు, తుని, తేటగుంట, తొండంగి, ఏవి నగరం లేఔట్లో అవసరమైన అప్రోచ్, ఇంటర్నల్ రోడ్లు, లెవెలింగ్, స్టోన్ ప్లాంటేషన్ పనులపై ఆయన నిశితంగా సమీక్షించి, వాటిని ముమ్మరం చేసేందుకు కార్యాచరణను, ఎదురవువుతున్న చిన్న చిన్న సమస్యలను అధిగమించేందుకు పరిష్కారాలను అధికారులకు సూచనలు జారీ చేశారు. లబ్ధిదారులు గృహ నిర్మాణానికి చొరవ చూపని చోట్ల అందుకు గల కారణాలను విశ్లేషించి, అవరోధాలను, సంశయాలను తొలగించాలని, అందరూ ఇళ్ల నిర్మాణాలు సత్వరం చేపట్టేలా చైతన్య పరచాలని మంత్రి రాజా అధికారులను కోరారు. పేద ప్రజలందరికీ గృహ కల్పన లక్ష్యం నెరవేర్చే దిశగా అధికారులు అంకిత భావంతో కృషి చేయాలని, ఇందుకు హౌసింగ్, రెవెన్యూ ఇతర ఇంజనీరింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు. ప్రస్తుత సీజన్ గృహ నిర్మాణానికి అత్యంత అనువైన సమయని, పనులు ముమ్మరంగా నిర్వహించాలని సూచించారు. కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ సమీక్షలో మంత్రి సూచించిన అంశాలపై ఆయా శాఖలు సమన్వయంతో త్వరితగతిన చర్యలు చేపట్టి సకాలంలో లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ బి.సుధాకర్ పట్నాయక్, పెద్దాపురం ఆర్‌డిఒ జె.సీతారామరావు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎం.శ్రీనివాసు, డ్వామా పీడీ ఎ.వెంకట లక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి, పంచాయతీరాజ్ ఎస్ఇ ఎం.శ్రీనివాసు, తుని కమిషనర్ ప్రసాద్ రాజు, తుని నియోజకవర్గ మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, హౌసింగ్, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖల ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మోడీని గద్దె దింపండి.. దేశాన్ని కాపాడండి

ప్రజాశక్తి - కాకినాడ

మోడీని గదింపండి దేశాన్ని కాపాడండి అని నినాదంతో సిపిఐ, సిపిఎం ప్రచార బేరి కార్యక్రమంలో భాగంగా దుమ్ములపేట ఏరియాలో నాయకులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏవి నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో అధికారంలో ఉన్న మోడీ బిజెపి ప్రభుత్వం నిత్యవసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచి సామాన్య ప్రజల నడ్డి విరిచే పని చేస్తుందన్నారు. రోజురోజుకు పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలను విపరీతంగా పెంచుకుంటూ పోతుందన్నారు. కార్పొరేట్లకు లాభాలు చేకూర్చే విధంగా కార్మిక వర్గాన్ని బానిసలగా మార్చే విధంగా 44 కార్మిక చట్టాలను మార్పు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని ఇవి చాలా దారుణమని అన్నారు. మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రయివేటు వ్యక్తులకు ధారాధత్వం చేసే విధంగా నిర్ణయాలు చేస్తోందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం చేస్తే సిపిఎం పార్టీ చూస్తూ ఊరుకోదని పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతుందని అన్నారు. విద్యుత్ సవరణ చట్టం పేరుతో రాష్ట్రంలో విద్యుత్ చార్జీలను విపరీతంగా పెంచుకుంటూ పోతున్నారని, మోడీ ఏ నిర్ణయం చేస్తే ఆ నిర్ణయాన్ని రాష్ట్రంలో అమలు చేసే పని రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని దీనివల్ల కష్టజీవులు కార్మిక వర్గం కష్టాల పాలు అవుతున్నారని అన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోయినా అధికార పక్షం ప్రతిపక్షం కూడా ప్రశ్నించకుండా రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్నారని అన్నారు. దేశంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకే సిపిఎం, సిపిఐ ప్రచార కార్యక్రమం చేపడుతున్నాయని ప్రజలందరూ ఈ విషయాలు గమనించి రాబోయే కాలంలో ఆలోచించి కష్టజీవుల విధానాలు, కార్మికుల విధానాలు అమలు చేసే వ్యక్తులను ఎన్నుకోవాల న్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు డి.శేష బాబ్జి, సిహెచ్ రాజ్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో చంద్రమల్ల పద్మ, మేడిశెట్టి వెంకటరమణ, మలకా వెంకటరమణ, రొంగల ఈశ్వరరావు, రాంప్రసాద్ మొదలైన వారు పాల్గొన్నారు.

ఉపాధి హామీ నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

ప్రజాశక్తి -కరప

జాతీయ గ్రామీణ ఉపాధి పథకం నిర్వీరం చేసే కుట్రలు కేంద్ర ప్రభుత్వం బిజెపి అవలంబిస్తుందని జిల్లా సిపిఎం నాయకురాలు ఎం.రమణి అన్నారు. బుధవారం కరప గ్రామంలో వామపక్షాల ప్రచార భేరిలో భాగంగా ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బిజెపి పాలనలో రాష్ట్రానికి ఉపాధి హామీకిచ్చే నిధులను ప్రతి సంవత్సరం తగ్గించుకుంటూ వస్తుందన్నారు. గత సంవత్సర బడ్జెట్లో రూ.90 వేల కోట్లు కేటాయించగా ఈ ఏడాది బడ్జెట్లో రూ.60 వేలు కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలకు ప్రయత్నాలు చేస్తోందని ఈ విధానాలను ఐక్యంగా అందరూ వ్యతిరేకించాలని రమణి అన్నారు. అనంతరం ప్రజా వ్యతిరేక నిరంకుశ మతోన్మాద బిజెపిని సాగనం పుదాం దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో వామపక్షాలు ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుమారి, వెంకటలక్ష్మి, ఆశ, ప్రసాద్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కరపలో ఉపాధికూలీలతో మాట్లాడుతున్న రమణి

కాకినాడ దుమ్ములపేటలో ప్రచార బేరి నిర్వహిస్తున్న సిపిఐ సిపిఎం నాయకులు

గొల్లపాలెం ఘటనపై సమగ్ర విచారణకు డిమాండ్

మృతులు ఒక్కొక్కరికీ ప్రభుత్వం రూ.25 లక్షల పరిహారం అందించాలి : సిపిఎం జిల్లా కమిటీ

ప్రజాశక్తి - కాజులూరు

కాజులూరు మండలం గొల్లపాలెంలో ఇద్దరు దళిత యువకులు మృతి చెందిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిజ నిజాలు బయటకు తీయాలని సిపిఎం, జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం ఉదయం ప్రజా సంఘాల నాయకులుతో కలిసి జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, గొల్లపాలెంలో మతి చెందిన ఆర్యవటం గ్రామానికి చెందిన తాతపూడి మహేష్, శీల గ్రామానికి చెందిన నేరేడుపల్లి శివకుమార్ ఇళ్లకు వెళ్లి వారి కుటుంబాలను పరామర్శించారు, ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మాట్లాడుతూ తాతపూడి మహేష్ డ్రైవర్‌గా పని చేస్తూ ఆ పేటలో చుట్టుపక్కల వారికి సహకారంగా ఉంటూ యువతకు డ్రైవింగ్ శిక్షణ ఇచ్చి ఆసరాగా ఉండేవాడని గ్రామస్తులు తెలిపారు ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ మోర్త రాజశేఖర్ మాట్లాడుతూ మృతుడి తాతపూడి మహేష్ తల్లిదండ్రులు ఇద్దరూ అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారని వారికి చేదోడు వాదోడుగా ఉంటున్న కుమారుడు అర్ధాంతరంగా చనిపోవడం ఆ కుటుంబానికి తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు గురి చేస్తున్నాయన్నారు. అలాగే మృతుడు నేరేడుపల్లి శివ కుమార్ కుటుంబ సభ్యులు శీల గ్రామానికి చెందిన పేద కుటుంబం కూడా డ్రైవింగ్ వత్తి చేసుకునే శివకుమార్ సంపాదనపై ఆధారపడ్డారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం గొల్లపాలెంలో జరిగిన దళిత యువకులు మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపించి ఒక్కొక్క కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం, రెండు ఎకరాల భూమి, ఇళ్ల స్థలం ఇచ్చి, ఇళ్లు కట్టించాలని వారు డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలను పరామర్శించిన వారిలో కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ కె సింహాచలం, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్ష కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు, కెవిఎస్ శ్రీనివాస్ ఉన్నారు.

గొల్లపాలెం మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న సిపిఎం జిల్లా నాయకులు

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

ప్రజాశక్తి - కాజులూరు

మంగళవారం బయో డీజిల్ ట్యాంక్‌లోకి దిగిన ఇద్దరు యువకులు మృతిచెందిన విషయం విదితమే. ఈ ఘటనపై మృతుల తండ్రుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమా నాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు గొల్లపాలెం ఎస్ఐ తులసీరామ్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం పోలీస్ స్టేషన్లో ఎస్ఐ తులసీరామ్ విలేకరులతో మాట్లాడుతూ గొల్లపాలెం శివారులో మంగళవారం జరిగిన ఘటనలో తాతపూడి మహేష్, నేరేడుపల్లి శివకుమార్ మృతి చెందగా వారి తండ్రులు అప్పారావు, సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రెండు కరోనా కేసుల నమోదు

ప్రజాశక్తి- రౌతులపూడి

రౌతులపూడి ప్రభుత్వాసుపత్రిలో బుధవారం రెండు కరోనా కేసులు నమోదయ్యాయి అనకాపల్లి జిల్లా నాతవరం మండలం పి జగ్గంపేటకు చెందిన భార్యాభర్తలు అనారోగ్యంగా బుధవారం రౌతులపూడి ప్రభుత్వా ఆసుపత్రికి వచ్చారు వీరికి కరోనా పరీక్షలు నిర్వహించగా పాజిటివ్‌గా నిర్ధారణైందని వైద్యులు తెలి పారు. కరోనా కేసులు నమోదు కావడంతో మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని వైద్యాధికారి జానకి దేవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరు మాస్క్ ధరించాలని పేర్కొన్నారు

నాణ్యతా ప్రమాణాలతో పనులు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ జెఎన్‌టియుకెలో రూ.17 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులు పూర్తి నాణ్యతా ప్రమాణాలతోనే చేపట్టినట్లు జెఎన్‌టియుకె సివిల్ విభాగం ఎఇఇ సన్నీ ఫ్రాన్సిస్ ఒక ప్రకటనలో తెలిపారు. పనులు నిరంతరం అధికారుల పర్యవేక్షణలోనే కొన సాగుతున్నాయని తెలిపారు. నాణ్యత ప్రమాణాల విషయంలో ఇటీవల పత్రికలలో వచ్చిన కథనాలు వాస్తవానికి దూరంగా ఉన్నాయని, నాణ్యత ప్రమాణాలు పాటించడం విషయంలో రాజీపడే ప్రసక్తి లేదన్నారు..

గర్భిణులకు లయన్స్ భోజనాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

చిట్టూరి కృష్ణ లయన్స్ ఆర్య జనని ట్రస్ట్ ఆధ్వర్యంలో కృష్ణ కుటుంబ సభ్యులు తాళ్లరేవు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం 100 గర్భిణులకు పౌష్టిక ఆహార అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు బిళ్ళకుర్తి శ్రీనివాసరెడ్డి సి.హెచ్.సి. డాక్టర్ శిరీష, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

అదంతా 'గాలి'గా సంపాయించిందేగా..!!

పన్ను రాయితీపై అవగాహన కల్పించండి

-రూ 20 కోట్ల వసూలు లక్ష్యం : ప్రత్యేక బృందాల ఏర్పాటు : కాకినాడ నగరపాలక కమిషనర్ మహేష్ కుమార్

సమీక్షలో మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ మహేష్ కుమార్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఈ నెల ఏప్రిల్ 30 చివరి నాటికీ ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను ఏక మొత్తంగా ఒకేసారి చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్ రావిరాల ఆదేశించారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో బుధవారం అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్‌తో కలిసి పన్నుల వసూళ్ళ, రిబేటు, నీటి పన్నులపై వాటర్ వర్క్స్ అధికారులు,ఆర్వోలు, ఆర్ఐలు, సచివాలయ కార్యదర్శులతో సమీక్షించారు. ప్రభుత్వం కల్పించిన రాయితీ అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులందరికీ తెలిసేలా మరింత విస్కృత ప్రచారం చేయాలన్నారు.

మరో 10 రోజుల్లో గడువు ముగుస్తున్నందున సంబంధిత ఉద్యోగులంతా ఈ అంశంఃపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పన్ను రాయితీ వల్ల గత 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను ద్వారా సుమారు రూ.15 కోట్లు వసూలు అయిందని, ఈ ఏడాది రూ 20 కోట్ల వసూళ్ల లక్ష్యంగా పని చేయాలన్నారు. నీటి పన్నుకు సంబంధించి ప్రస్తుత పాత, బకాయిలు వసూలు చేసేందుకు సచివాలయాల స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా సచివాలయాల అడ్మిన్లు, ఎమినిటీ కార్యదర్శులు, ఎఇలు, ట్యాప్ ఇన్స్పెక్టర్లతో ఏర్పాటయ్యే బృందాలు నీటి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో వాటర్ వర్క్స్ డిఇ ప్రభాకర్, ఆర్ఐలు చెక్కా రమణ, నిర్మలా కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

- కార్పొరేషన్ భవన నిర్మాణ పనులు పరిశీలన

అధునాతన వసతులతో విశాల ప్రాంగణంలో చేపట్టిన కాకినాడ నగరపాలక సంస్థ నూతన భవన నిర్మాణ పనులను కార్పొరేషన్ కమిషనర్ మహేష్ కుమార్ రావిరాల బుధవారం పరిశీలించారు. నిర్మాణ పనుల ప్రగతిని అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. రూ.38 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో నాలుగు అంతస్తుల్లో భవనాన్ని నిర్మిస్తున్నట్లు స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకట్రావు కమిషనర్ కు వివరించారు. నూతన భవనానికి సంబంధించిన బిల్డింగ్ ప్లాన్ నమూనాను కమిషనర్ పరిశీలించారు. ఆయన వెంట స్మార్ట్ సిటీ ఎస్ఇ పి.వెంకట్రావు, కాంట్రాక్టర్, సుధాకర ఇన్ఫ్రా సంస్థ ప్రతినిధి వంగ పుల్లారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాలేయంపై అశ్రద్ధ వద్దు

- మెడికవర్‌లో ప్రపంచ కాలేయ దినోత్సవం

ప్రజాశక్తి - కాకినాడరూరల్

డాక్టర్ ఆదిద్య

మానవ శరీరంలోని అతి పెద్ద గ్రంధి కాలేయం మానవ శరీరానికి అత్యంత ముఖ్యమైన సంక్లిష్టమైన అవయవాలలో ఒకటని సర్జికల్ గాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ ఆదిత్య అన్నారు. ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా బుధవారం మెడికవర్ హాస్పిటల్స్‌లో కాలేయ ఆరోగ్యంపై నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన నిర్వహించారు. శరీర అవయవాలలో కాలేయం కొంచెం భిన్నమైనదన్నారు. కాళ్లు, చీల మండలలో వాపు, ఆకలి లేకపోవడం, వికారం, వాంతులు, జ్వరం, కామెర్లు, కడుపు నొప్పి, మూత్రం రంగులో మార్పు, పొట్ట చుట్టూ దురద, ఎరుపు చర్మం, మలంలో రక్తం స్రావం లక్షణాలు కనిపిస్తే కాలేయ సంబంధిత వ్యాధి బారిన పడుతున్నామని గుర్తించాలని అన్నారు. రెండు లేదా అంతకంటే ఎక్కువ లక్షణాలు ప్రబలంగా ఉన్నట్లయితే తక్షణ వైద్యుడిని సంప్రదించాలన్నారు. .ఇండియాలో లివర్ పనితీరు దెబ్బతినడానికి ప్రధాన కారణం మద్యం సేవించడమేనని దీనికి అలవాటు అయిపోవడంతో రాను రాను సిర్రోసిస్ సమస్యకు గురవుతారన్నారని చెప్పారు.హెపటైటిస్ బీ, సి వంటి వైరల్ ఇన్ఫెక్షన్స్ కూడా ఈ లివర్ ప్రాబ్లెమ్ కు కారణమని 10 నుంచి 15 సంవత్సరాలకు పైగా ఈ ఇన్ఫెక్షన్స్‌తో సతమతమ య్యేవారిలో సిర్రోసిస్ సమస్య కనిపించవచ్చున్నారు. ముందుగానే వ్యాధి లక్షణాలను గ్రహిస్తే తద్వారా కాలేయ వ్యాధులు వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయన్నారు. మద్యం శరీరాన్ని విపరీతంగా డీహైడ్రేట్ చేస్తుందన్నారు. ఆరోగ్యకరమైన ఆహారంలో ఆకు కూరలు ,పీచు పదార్థాలు ఎక్కువగా ఉండేలా ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.(క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని ఆయన తెలిపారు.

నేడు 'అదానీ అవినీతి - క్రోనీ కేపటలిజం'పై సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఉపాధ్యాయ ఉద్యమానికి సహాయ సహకారాలు అందించిన సత్యవతి దేవి ప్రథమ వర్ధంతి సందర్భంగా స్థానిక వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు భవనంలో ఈ నెల 20వ తేదీ సాయంత్రం యుటిఎఫ్ పెద్దాపురం మండల,పట్టణ శాఖల ఆధ్వర్యంలో "అదానీ అవినీతి-క్రోనీ కేపిటలిజం" అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్టు యుటిఎఫ్ మండల అధ్యక్షులు యు సూర్యనారాయణ, పట్టణ అధ్యక్షులు వి.మధు కుమార్‌లు తెలిపారు. ఈ సదస్సులో ఎల్ఐసి యూనియన్ జాతీయ నాయకులు పి.సతీష్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు.

పెద్దాపుర పోస్టాఫీస్ భవన నిర్మాణానికి రూ.1.78 కోట్లు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

పెద్దాపురం పోస్టాఫీసు భవనం నిర్మాణానికి రూకోటీ 78 లక్షలు నిధులు మంజూరైనట్లు కాకినాడ ఎంపి వంగాగీత ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దాపురం పట్టణంలో 1956లో పోస్ట్ ఆఫీస్ ప్రారంభించి ఇప్పటికీ 66 సంవత్సరాల నుండీ ప్రజలకు పోస్టల్ సేవలను అందిస్తున్న పోస్ట్‌ఆఫీస్‌కు నూతన భవనం మంజూరయ్యాన్నారు. మంజూరుకు సహకరించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. . కాకినాడ జిల్లాలో పోస్ట్ ఆఫీస్‌ల భవనములు కాకినాడ, పెద్దాపురం హయ్యర్ సెలెక్షన్ గ్రేడ్ పోస్ట్ ఆఫీసులు, అన్నవరం లోయర్ సెలెక్షన్ గ్రేడు శాశ్వత భవనాలు మంజూరు చేయాలనీ కేంద్ర కమ్యూనికేషన్స్ మంత్రికి, సంబంధిత కేంద్ర అధికారులను తాను కోరగా మొదటిగా పెద్దాపురం ఎంపిక కావడం సంతోషం అని ఎంపి పేర్కొన్నారు.

ప్రతిపాదనలు కోసం ఉత్తర ప్రత్యుతరాలు త్వరిత గతిన పూర్తి చేసిన చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్‌కు,స్టేట్ కమిషనర్‌కు, పోస్టల్ సూపరింటెన్డెంట్ కాకినాడ జిల్లా వారికి అభినందనలు తెలిపారు. త్వరలో ఇంజినీరింగ్ శాఖ టెండర్ ప్రొసెస్ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్

ప్రజాశక్తి - కాకినాడరూరల్

వేసవిలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన ముఖ్యమని ఇన్చార్జి అగ్నిమాపక అధికారి కె.రమణ అన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అగ్ని ప్రమాదాల నివారణకు ఈనెల 14 నుంచి 20 వరకు వారోత్సవాలు నిర్వహి స్తున్నామని అన్నారు. షార్ట్ సర్క్యూట్స్, గ్యాస్ సిలిండర్ వలన అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. వాకర్స్ జిల్లా కోఆర్డినేటర్ అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల సమయంలో సిబ్బంది చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. అనంతరం అగ్ని ప్రమాదాలు ఏ విధంగా జరుగుతాయో వాటిని ఏ విధంగా నివారించాలో చక్రపాణి తదితర సిబ్బంది ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహించి ప్రాక్టికల్‌గా వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అడబాల ఆధ్వర్యంలో రమణను ఘనంగా సత్కరించారు కార్యక్రమంలో రాఘవరావు, సత్యనారాయణ, చందర్రావు తదితరులు పాల్గొన్నారు.

విజన్ హెల్త్ కేర్ ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి -రౌతులపూడి

రౌతులపూడిలో నూతనంగా ఏర్పాటు చేసిన విజన్ హెల్త్ కేర్ ఆస్పత్రిని ప్రత్తిపాడు ఎంఎల్ఎ పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ బుధవారం ప్రారంభించారు గ్రామీణ ప్రాంతాల్లో 24 గంటలు పనిచేసే ఆసుపత్రి ఏర్పాటు చేయడంపై ఆస్పత్రి యాజమాన్యాన్ని ఆయన అభినందించారు ఈ సందర్భంగా తేజస్, మనోజ, రాజేష్. మేఘనాథ్‌లు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

పెంకు పురుగుల దాడి

- తవుడు ఫ్యాక్టరీ ఎదుట గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం హుస్సేన్‌పురంలోని శ్రీ వెంకటరామా అయిల్స్ తవుడు ఫ్యాక్టరీ నిర్లక్ష్య ధోరణికి ఏడువేల మంది ప్రజలు ఇబందులు పడుతున్నామని ఆరోపిస్తూ బుధవారం సాయంత్రం ఫ్యాక్టరీ ఎదుట ఆందోళన చేపట్టారు. ఫ్యాక్టరీ యాజమాన్యం నిరంకుశ వైఖరి కారణంగా తవుడు నుండి వంట నూనె తయారు చేస్తూ వ్యర్థాలను, దుమ్ము ధూళితో ఇతర కాలుష్యాన్ని వదులుతూండటంతో పెంకు పురుగులు తినే అన్నంలో, తాగేనీటిలో పడుతూ కలుషితం చేస్తున్నాయని, బయటకు వద్దామంటే కళ్లలో పడి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు, కాలుష్య నియంత్రణ అధికారులు వెంటనే స్పందించి ఫ్యాక్టరీపై వెంటనే చర్యలు తీసుకోవాలని బుధవారం ఫ్యాక్టరీ గేటు ముందు పరిసర గ్రామాల ప్రజలతో కలిసి ధర్నా నిర్వహించారు

24న విజయవాడలో కాంగ్రెస్ సభ

ప్రజాశక్తి -యు. కొత్తపల్లి

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ పై కక్ష సాధింపు చర్యలకు నిరసనగా ఈనెల 24వ తేదీన విజయవాడలో జింఖానా గ్రౌండ్స్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆధ్వర్యంలో చేపడుతున్న కాంగ్రెస్ మహాసభను పార్టీ అభిమానులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా విచ్చేసి విజయవంతం చేయాలని సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓలేటి రాయ భాస్కరరావు పిలుపునిచ్చారు. ఉక్కు కర్మాగారం, పోలవరం ప్రాజెక్టు, రాష్ట్ర అభివృద్ధి అంశాలపై పార్టీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ప్రసంగిస్తారన్నారు.

మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేస్తున్న బేబీ రాణి

సొసైటీతో అంగన్‌వాడీలకు మేలు

ప్రజాశక్తి - సామర్లకోట

త్రిఫ్ట్ సొసైటీలో చేరిన వారికి ఎంతో మేలు చేకూరుతుందని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీ రాణి అన్నారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలోని సామర్లకోటలో ఇటీవల మతి చెందిన అంగన్‌వాడీ హెల్పర్ యేలేటి గంగాభవాని కుమార్తెకు యేలేటి లక్ష్మికి త్రిఫ్ట్ సొసైటీ ద్వారా వచ్చిన రూ.30 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బేబీ రాణి మాట్లాడుతూ పేద పిల్లలకు పౌష్టికాహారం అందించడంతోపాటు అనేక ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందే విధంగా పనిచేస్తున్న అంగన్‌వాడీలను ప్రభుత్వం రిటైర్ అయిన తరువాత కనీసం పట్టించుకోకుండా నామమాత్రంగా టీచర్‌కు రూ.50 వేలు హెల్పర్‌కు రూ.20 వేలు ఇచ్చి చేతులు దులుపుకుంటోందని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని అంగన్‌వాడీ సంఘం ఆధ్వర్యంలో 6 సంవత్సరాల నుండి సొసైటీ నడుస్తోందని అన్నారు. దీని ద్వారా అనేకమంది అంగన్‌వాడీలకు రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మేలు జరిగిందని తెలిపారు. ఇటీవల సామర్లకోటలో మృతి చెందిన ఏలేటి గంగాభవాని ఇప్పటి వరకు రూ.2 వేలు చెల్లించారని, ఆమె అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె కుమార్తెకు రూ.30 వేలు వచ్చాయన్నారు. మిగిలిన అంగన్‌వాడీ వర్కలందరూ కూడా సొసైటీలో సభ్యులుగా నమోదు చేయించుకోవాలని ఆమె కోరారు. చనిపోయిన అంగన్‌వాడీల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని చనిపోయిన వారి కుటుంబ సభ్యులకే అంగన్‌వాడీ పోస్టులను ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో త్రిఫ్ట్ సొసైటీ చైర్మన్ చంద్రావతి, డైరెక్టర్ చామంతి, సామర్లకోట అర్బన్ అధ్యక్ష కార్యదర్శులు అమలావతి, నాగమణి, సిఐటియు జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాస్, సెక్టర్ లీడర్లు, అంగన్‌వాలు పాల్గొన్నారు.

23న ముమ్మిడివరం ఎంఎంసి చైర్మన్‌గా శివన్నారాయణ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

సమావేశంలో మాట్లాడుతున్న కుడుపూడి శివన్నారాయణ

ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపికైన కుడుపూడి శివన్నారాయణ ఈ నెల 23 వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా శివన్నారాయణ తాళ్ళరేవు మండలం పి. మల్లవరం పంచాయతీ పత్తిగొందిలో ఆయన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తనను ఎంపిక చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డికి, ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్‌కు, సహకరించిన నియోజకవర్గ నాయకులకు, కార్యకర్తలకు ఆయన కతజ్ఞతలు తెలిపారు. 23 వ తేదీ ఆదివారం మహిపాల్ చెరువు సెంటర్లోని గ్రాండ్ పార్క్ కళ్యాణ మండపంలో ఉదయం 11 గంటలకు కమిటీ డైరెక్టర్ లతో కలిసి ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతున్నట్టు తెలిపారు. ముందుగా తన నివాసం వద్ద 9 గంటలకు ర్యాలీ ప్రారంభమై పదిన్నర గంటలకు వేదిక వద్దకు చేరుకుంటామన్నారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు తెలిపారు. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, ఇతర సంస్థల ప్రతినిధులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శివన్నారాయణ విజ్ఞప్తి చేశారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వృద్ధుని మృతి

ప్రజాశక్తి - కాజులూరు

డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీ నడపడంతో కాజులూరుకి చెందిన పుల్లేపు చక్రం (68) మృతి చెందినట్లు గొల్లపాలెం పోలీసులు తెలిపారు. పుల్లేపు చక్రం మంగళవారం రాత్రి పొలం నుండి సైకిల్‌పై ఇంటికి వస్తుండగా సమీపంలో ఉన్న ఇసుక లారీ ఇసుక దింపుకుని రివర్స్ చేస్తుండగా పుల్లేపు చక్రం కాలు, నడుము భాగంగా వెళ్లడంతో తీవ్ర గాయాలు పాలయ్యాడు. చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారని పోలీసులు తెలిపారు. మతుడు చక్రానికి భార్య ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డేవిడ్ రాజు తెలిపారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మరణం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మనస్థాపానికి చెంది పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉచ్చిలి గ్రామానికి చెందిన మాగాపు సూరిబాబు కుటుంబ తగాదాల నేపథ్యంలో మనస్థాపం చెంది ఈనెల 17న పురుగుల మందు తాగాడు. అతనిని కుటుంబ సభ్యులు రాజానగరం జిఎస్ఎల్ హాస్పిటల్ కి తరలించారు. అతని పరిస్థితి విసమించడంతో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సిహెచ్.సుధాకర్ తెలిపారు.

పేకాడుతున్న 8 మంది అరెస్ట్

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం ఎస్ఐ డి.సురేష్ బాబు ఆధ్వర్యంలో పోలీసులు చోడవరం శివారులో పేకాట శిబిరం పై దాడి చేశారు. బుధవారం జరిగిన ఈ సంఘటన లో 8 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.20,380, 104 పేక ముక్కలు స్వాధీనపర్చుకున్నామని ఎస్ఐ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి మండలం చిన్నాయగూడెంలోని ఒక ఇంటి వద్ద అక్రమంగా నిలువ ఉంచిన 8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పౌర సరఫరా శాఖ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో ఒక ఇంట్లో అక్రమంగా బియ్యం నిల్వ చేసినట్లు అందిన సమాచారం మేరకు పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ సుజాత, సిబ్బంది తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సుమారుగా 8 క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయి. ఆ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని గోపాలపురంలోని పౌరసరఫరాల మండల తరలించారు. అలాగే బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచినందుకుగాను సంబంధిత ఇంటి యజమానిపై కేసు నమోదు చేశారు.

నకిలీ వైద్య బృందంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-మండపేట

ద్వారపూడిలో నకిలీ వైద్యబృందం మెడికల్ క్యాంపు నిర్వహణపై మండల వైద్యాధికారి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి వివరాలు ఇవి.. పంచాయతీకార్యాలయం వద్ద ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించి మందులు అందజేస్తామని ఒకహెర్బల్ ప్రైవేట్ ఏజెన్సీ వారు పంచాయతీ సిబ్బందిని కోరగా అందుకు వారుఅనుమతించారు. బుధవారం నిర్వాహకులు వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఫుల్ బాడీ హెల్త్ చెకప్‌కు రూ.2000 ఖర్చవుతుండగా తాము ఉచితంగా చేస్తామని ప్రచారం చేశారు. వైద్య పరీక్షల కోసం స్థానికులు రాగా పరీక్షలు అనంతరం ఒక్కొక్కరికి రూ. 2వేల నుంచి రూ.3వేల వరకు విలువైన మందులు రాసి అమ్మకాలు ప్రారంభించారు. పంచాయతీ సిబ్బందికి అనుమానం వచ్చి మండల వైద్యాధికారి ఎస్ .సూర్యనారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన పంచాయతీకి చేరుకుని వారిని ఆరా తీశారు. తాము అన్ని అనుమతులతో క్యాంపుఏర్పాటుచేసినట్టు నిర్వాహకులు తెలిపారు. అయితే క్యాంపు నిర్వహిస్తున్న వారిలో క్వాలిఫైడ్ వైద్యులు, వైద్య సిబ్బంది లేరని ఆయన గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు జరిపి, మందులు విక్రయిస్తుండటంపై డాక్టర్ సూర్యనారాయణరెడ్డి రూరల్ పోలీసులకుఫిర్యాదు చేయగా ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

'జల జీవన్' పనుల పరిశీలన

ప్రజాశక్తి-అయినవిల్లి

తొత్తరమూడి గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న జలిజీవన్ మిషన్ పనులను మండల ఆర్డబ్ల్యూఎస్ జెఇ కల్యాణ్, స్థానిక సర్పంచ్ జయ సావిత్రితో కలిసి పరిశీలించారు ఈ సందర్భంగా కల్యాణ్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఎక్కడ తాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నమన్నారు. త్వరితగతన జలజీవన్ మిషన్ పనులను పూర్తిచేయడానికి కృషి చేస్తున్నామని గ్రామాల్లో పర్యటించి నీటి సరఫరా ఏ విధంగా ఉందో పర్యవేక్షిస్తున్నామన్నారు. ఇంకా ఎక్కడ పైపులైన్లు వేయాలి తదితర పనులను త్వరలో పూర్తిచేస్తామన్నారు.

20వ వార్డులో 'జగనన్నే మా భవిష్యత్తు'

ప్రజాశక్తి-మండపేట

స్థానిక 20వ వార్డు వైఎస్ఆర్ కాలనీలో ప్రజల సమస్యలు తెలుసుకోవడంలో భాగంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, కౌన్సిల్ సభ్యులు గ్రంధి శ్రీనివాస్, కొవ్వాడ బేబీ అప్పన్నబాబులతో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా వైపిపి పాలనపై అభిప్రాయ సేకరణ చేశారు. అనంతరం ఇళ్లకు, సెల్ ఫోన్లకు స్టిక్కర్లను అతికించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, సాధనాల శివ భగవాన్ యరమాటి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

అరకొర అంశాలకే పరిమితం

- సమస్యల ప్రస్తావన లేని జెడ్‌పి సమావేశం
- పలువురు గైర్హాజరు
- ధాన్యం కొనుగోలుపై లేని స్పష్టత
- ఉమ్మడి జిల్లా పరిషత్ సమావేశం తీరు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో బుధవారం జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో కొన్ని సమస్యలపై మాత్రమే చర్చకు అవకాశం దక్కింది. మొత్తం వివిధ శాఖలకు సంబంధించి 31 అంశాలను పొందు పర్చగా వ్యవసాయం, ఇరిగేషన్, పౌర సరఫరాలు, ఆర్ డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్య శాఖలకు చెందిన చర్చ కేవలం రెండున్నర గంటలు మాత్రమే జరిగింది. మూడు జిల్లాల్లో అనేక సమస్యలు వేధిస్తుండగా సమావేశాన్ని అర్ధంతరంగా ముగించడంపై అనేకమంది ప్రజా ప్రతినిధులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అజెండాలో చర్చించాల్సిన అంశాలు చాలా ఉన్నాయి. సమావేశం నిర్వహించే తీరు ఇదేనా.. ఇకనుంచి నన్ను పిలవకండి అంటూ అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు జెడ్పి అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ముఖ్య సమస్యలను చర్చించి వాటి పరిష్కారానికి సమగ్ర చర్యలు తీసుకోవడానికి వేదికగా ఉండాల్సిన జడ్‌పి సమావేశాన్ని ఇలా అర్ధాంతరంగా ముగించడం సరికాదంటూ పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. తమ సమస్యలను చెప్పుకోవడాని అవకాశం లేదంటూ పలువురు జడ్‌పిటిసిలు బహిరంగంగా ఆవేదన వ్యక్తం చేశారు.

జడ్‌పి సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు

ధాన్యం కొనుగోలుపై స్పష్టత లేకపోవడంతో దుమారం

వ్యవసాయ శాఖకు సంబంధించిన సమీక్షలో భాగంగా పలువురు ప్రజా ప్రతినిధులు ధాన్యం కొనుగోళ్లపై అధికారుల అస్పష్టత సమాధానాలపై పలువురు ప్రజాప్రతినిధులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. జడ్‌పి వైస్ చైర్మన్ బుర్ర అనుబాబు, ఎంఎల్‌సిలు తోట త్రిమూర్తులు, చిక్కాల రామ చంద్రరావు, ఐ.వెంకటేశ్వరరావు, ఎంపి పిల్లి సుభాష్ చంద్రబోస్, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డిలు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే చాలా వరకు కోతలు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో బొండాలు రకం కొనుగోలుపై అధికారులు నేటికీ స్పష్టత ఇవ్వలేదన్నారు. అన్ని రకాల ధాన్యాన్ని ఇంకా కొనుగోలు ప్రారంభించకపోవడంతో రైతులు బయట మార్కెట్లో తక్కువ ధరకు అమ్ముకుంటున్నారన్నారు. రబీలో ధాన్యం దిగుబడి ఎక్కువగా వస్తుందని, అయితే ఎకరాకు కేవలం 34 క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేస్తామని నిబంధనలు విధించడం సరికాదన్నారు. కొనుగోలు ఇంకా ఎందుకు ప్రారంభించలేదు. ఎంత ధాన్యం కొనుగోలు చేస్తారో తెలియజేయాలని అధికారులను కోరారు. ఉమ్మడి జిల్లాలో 8లక్షలకు క్వింటాళ్ల పైగానే బొండాలు రకం ఉత్పత్తి అవ్వగా టార్గెట్ తక్కువ తీసుకోవడం సరికాదన్నారు. దీనిపై కాకినాడ జిల్లా సివిల్ సప్లై డిఎం పుష్పామణి మాట్లాడుతూ బొండాలు రకం ధాన్యాన్ని ప్రభుత్వం తప్పనిసరిగా కొనుగోలు చేస్తుందని వివరించారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జెసి ధ్యానచంద్ మాట్లాడుతూ కోనసీమ జిల్లాలో 2.8లక్షల మెట్రిక్ టన్నుల దాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. ఎకరాకు 33 క్వింటాళ్ల దాన్యాన్ని కొనుగోలు చేసేలా ప్రభుత్వం మార్గ నిర్దేశకాలు జారీ చేసిందన్నారు. కాకినాడ జిల్లా వ్యవసాయ శాఖ జెడి విజయ్ కుమార్ మాట్లాడుతూ మూడు జిల్లాల్లోనూ 50 శాతం మేర బొండాలు ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.సుదూర ప్రాంతాలకు ధాన్యాన్ని రవాణా చేసేందుకు పలువురు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,స్థానిక ఆర్‌బికెల వద్దే అమ్ముకునేలా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదంటూ ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అధికారులను ప్రశ్నించారు. అలాగే ఆర్‌బికెల్లో ఒకలా, రైస్ మిల్లుల్లో మరోలా తూకాల్లో తేడాలు చూపించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. దీనిపై జెసి ధ్యానచంద్ మాట్లాడుతూ ఈ సమస్యలు ఈ ఏడాది ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపి పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ముమ్మిడివరం మండలం లంక ఆఫ్ ఠానే లంక, పశువులంక, గేదెల లంక తదితర గ్రామాల్లో ఒఎన్‌జిసి డ్రెడ్జింగ్ పనుల వలన పలువురు రైతులు తమ పంటలను పూర్తిస్థాయిలో నష్టపోతున్నారని, రైతులకు పరిహారం ఇవ్వడంలో అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో తెలియజేయాలని కోరగా సమస్య ఇంకా తమ దృష్టికి రాలేదని ఆ జిల్లా జెసి తెలిపారు.

సాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం ఏదీ.?

ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తాగు, సాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం చూపడం లేదన్నారు. జూన్ 1న సాగునీరు విడుదల చేశామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా కాలువల మరమ్మతుల కారణంగా సాగునీటిని వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. నార్లు వేసుకునేలా అను కూలంగా లేదన్నారు. ఈ ఏడాదైనా కాలువల మరమ్మతుల పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ధవలేశ్వరం, విజ్జేశ్వరం పరిధిలో వాటర్ గ్రిడ్ పథకంలో భాగంగా ఇంటింటికి తాగునీటిని అందించే ప్రాజెక్టు పనులు అటకెక్కాయన్నారు. కోనసీమ జిల్లాలో 32 మండలాలకు, కాకినాడ జిల్లాలో కేవలం నాలుగు మండలాల కేంద్రాల్లో మాత్రమే ఈ ప్రాజెక్టులో భాగంగా ఇంటింటికి త్రాగునీటిని అందించారన్నారు. మిగిలిన ప్రాంతాల్లో ఎప్పటికీ అందజేస్తారని సంబంధిత శాఖ అధికారులను ఆయన ప్రశ్నించారు.

సమావేశంలో పాల్గొన్న ఎంఎల్‌సి అనంతబాబు

దళిత యువకుడిని హత్య చేసి నేరుగా డోర్ డెలివరీ చేసిన కేసులో ప్రధాన నిందితుడిగా ఉండి బెయిల్‌పై వచ్చిన ఎంఎల్‌సి అనంత ఉదయభాస్కర్ సుదీర్ఘకాలం తర్వాత బుధవారం జరిగిన జడ్‌పి సమావేశానికి హాజరయ్యారు. దీంతో పలువురు ప్రజా ప్రతినిధులు హత్య కేసుపై మరోసారి చర్చించుకున్నారు.

ఆలస్యంగా సమావేశం, పలువురు డుమ్మా

సమావేశం గంటపాటు ఆలస్యంగా ప్రారంభం కావడంతో సహా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టారు. నలుగురు ఎంఎల్ఎలు తప్ప మిగిలిన నియోజవర్గాల ఎంఎల్ఎలు, కాకినాడ, అమలాపురం, రాజమండ్రి ఎంపిలు వంగా గీత, అనురాధ, మార్గాని భరత్ హాజరు కాలేదు. తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల కలెక్టర్లు రాలేదు. మంత్రి దాడిశెట్టి రాజా కొంతసేపు మాత్రమే ఉండి వెళ్లిపోయారు.

దళిత కూలీల మృతితో విషాదం

- రోడ్డున పడ్డ రెండు కుటుంబాలు

ప్రజాశక్తి-సామర్లకోట

సామర్లకోట బలుసులపేటలో బుధవారం సాయంత్రం జరిగిన చర్చి గోడ కూలిన సంఘటనలో దుర్మరణం చెందిన కూలీలు పిట్టా అర్జునరావు (35), మచ్చా నాగేశ్వరరావు (శామ్యూల్ 35)ల మృతితో రెండు దళిత కుటుంబాలు రోడ్డున పడ్డాయి. రోజు వారీ కూలీ చేసుకుంటే గాని గడవని వారి కుటుంబాలు ఈ సంఘటనతో రెండు కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి. ఇంటికి సమీపంలోనే చర్చి నిర్మాణం పనులు చేపడుతుండగా ఈ సంఘటన జరగడంతో మృతుల బంధువులు, స్నేహితులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలం నకు చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. వారిని బంధువులు, స్థానికులే చర్చి బీమ్ పిల్లర్ శిథిలాల నుండి బయటకు తీసి చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గం మధ్యలో మృతి చెందారు. మృతుడు పిట్టా అర్జునరావుకు భార్య సావిత్రి, అమ్మాయి సాత్విక (7), అబ్బాయి సంధ్యా కుమార్ (9)లు ఉన్నారు. హఠాత్తుగా కుటుంబానికి ఆధారమైన భర్తను, తండ్రి చనిపోవడంతో పిల్లలు, భార్య రోదిస్తున్న తీరు చూపరులను కలచివేసింది. ఇంటికి వస్తాడన ుకున్న నాన్న ఇక రాడు అనే విషయం తెలిసీ తెలియక వారు తీవ్రంగా రోదిస్తున్నారు.

అలాగే మరో మృతుడు మచ్చా నాగేశ్వరరావు భార్య కామేశ్వరి, ఇద్దరు ఆడపిల్లలు అపర్ణ ఇటీవల 10వ తరగతి పరీక్షలు రాసింది. రెండో కుమార్తె సంధ్య తొమ్మిదో తరగతి చదువుతుంది. నాగేశ్వరరావుది ప్రేమ వివాహం కాగా, కడవరకు తోడు ఉంటానని చెప్పి మధ్యలోనే వదిలేసి వెళ్ళిపోయవా అంటూ భార్య రోదిస్తున్న తీరు హృదయాలను కలచివేస్తుంది. కుమార్తేలు ఇద్దరిని ఎంతైనా చదివిస్తామని చెప్పేవారని, మా కోసమే కష్టపడుతున్నానని చెప్పేవారని, ఇప్పుడు మా తండ్రి లేకపోతే మాకు ఎవరు దిక్కు అని చిన్నారులు ఇద్దరు కన్నీటి పర్యంతం అయ్యారు.వారిని చుట్టుపక్కల వారు బంధువులు సముదాయించినా వారు ఆగని పరిస్థితి. అయితే చర్చి నిర్మాణం విషయంలో మున్సిపల్ అధి కారులకు నిర్వాహకులు పి.విజయకుమార్ ఎటు వంటి సమాచారం ఇవ్వలేనట్లు తెల్సింది. ఎటువంటి అను మతులు పొందకుండా ఎటువంటి పర్యవేక్షణ లేకుండా పనులు చేపడుతున్నారన్న ఆరోపణ ఉన్నాయి.

కూలిన చర్చిగోడ ..... మృతులు పిట్టా అర్జునరావు, మచ్చా నాగేశ్వరరావు (ఫైల్ ఫోటోలు

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

కాగా మృతుల కుటుంబాలను పెద్దాపురం ఎంఎల్ఎఉ నిమ్మకాయల చినరాజప్ప, ఎపిస్టేట్ హౌసింగు బోర్డు చైర్మన్, పెద్దాపురం నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు, పెద్దాపురం జనసేన పార్టీ ఇన్‌చార్జి తుమ్మల రామ స్వామి (బాబు), వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు,సీపీఎం నాయకులు కరణం ప్రసాదరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి బాలం శ్రీనువాసు, భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు ప్రకృతి ఈశ్వరరావు, పెనుపోతుల సత్తిబాబు, కోన రాంబాబు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు అడబాల కుమాస్వామి, కార్యదర్శి బడుగు శ్రీకాంత్, రైతు నాయకుడు కంటే బాబు, టీడీపీ కౌన్సిలర్ బలుసు వాసు, జనసేన పట్టణ అధ్యక్షుడు సరోజా వాసు, పిట్టా జానకిరామారావు, మంచెం సాయి బాబు తదితరులు పరామర్శించారు. మృతుల కుటంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఎంఎల్ఏ చినరాజప్ప, జనసేన్ ఇన్‌చార్జి తుమ్మల బాబులు డిమాండ్ చేశారు. లేకుంటే బాధితుల తరపున పోరాటం చేస్తామన్నారు. అలాగే ప్రమాదానికి కారణమైన చర్చి నిర్వాహకులు కూడా మృతుల కుటుబాలకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయ పడిన మూడో కార్మికుడు ఎడగల అబ్రహాం పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు సమాచారం. కాగా కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతులు, క్షత గాత్రుడి కుటుంబీకులను పరామర్శించి పెద్దాపురం ఎంఎల్ఏ నిమ్మకాయల చినరాజప్ప, ఎపి స్టేట్ హౌసింగ్ బోర్డు చైర్మన్ దవులూరి దొరబాబులు ధైర్యం చెప్పారు. కేసును సామర్లకోట సిఐ కె దురా ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు

ప్రజాశక్తి- కరప

కరప గ్రామంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయినట్లు కరప ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు గ్రామానికి చెందిన అమ్మలకంటి కిరణ్ హీరో హెూండా బైక్‌పై కాకినాడ వైపు వెళుతూ కాకినాడ నుండి వస్తున్న కారును స్వర్ణ థియేటర్ సమీపంలో ఢీకొట్టడంతో కిరణ్‌కు కాలుకు బలమైన గాయమైంది. సమాచారం తెలుసుకున్న కరప ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో కలిసి క్షతగాత్రున్ని కాకినాడ జిజిహెచ్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న 'సంఘం శరణం గచ్ఛామి'

ప్రజాశక్తి-మండపేట

అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏడిద సంత మార్కెట్ వద్ద హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ క్రియేషన్స్ వారు ప్రదర్శించిన 'సంఘం శరణం గచ్ఛామి' నాటకం ఆకట్టుకుంది. ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ యడ్ల వెంకట్రావు ఆధ్వర్యంలో ఈ నాటకం ప్రదర్శించారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి ఏడిద గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపిపి పసుమర్తి నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి, వైసిపి గ్రామ నాయకులు పలివెల సుధాకర్, వల్లూరి రామకృష్ణ, అంబేద్కర్ సంఘ నాయకులు యడ్ల సత్య కుమార్ తదితరులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి, సిపిఐ నాయకులు, అంబేద్కర్ సంఘ నాయ కులు, అభిమానులు, అందుకూరి సాయి, అందుకు రవికుమార్, మేడిశెట్టి భాస్కరరావు, అంబేద్కర్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

నాటకంలో ఒక సన్నివేశం

అర్హులకు పథకాలు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అన్నారు. బుధ వారం నల్లూరులో గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంఎల్‌సి తోట పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో పర్యటించి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఇంటింటా తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కురుపూడి ఉదయశ్రీ, ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి, జెడ్‌పిటిసి సభ్యుడు పుట్టపూడి వీర వెంకట సూర్యనారాయణ, వైసిపి నాయకులు పుట్ట కృష్ణమూర్తి తదితరులు, పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్‌సి తోట

29న అఖిలపక్ష బిసి నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

బిసిలపై ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 29న కాకినాడ సూర్యకళామందిరంలో అఖిల పక్షం బిసిల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటుచేసినట్టు రాష్ట్ర బిసి సెల్ జోన్-2 కోర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. వైసిపి తప్ప అన్ని ప్రధాన రాజకీయ పార్టీల బిసి నేతలు పాల్గొంటారని వెల్లడించారు. సమావేశానికి టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరపు అచ్చెన్నాయుడు, పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, బిసి సెల్ రాష్ట్ర అధ్యక్షులు కోళ్ల రవీంద్ర, బిసి నాయకులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, పార్లమెంటు కోఆర్డినేటర్ బండారు సత్యనారాయణ మూర్తి, తదితర ముఖ్య నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి జోన్ -2 పరిధిలో గల కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, ఏలూరు, నరసాపురం పార్లమెంట్‌లలో బిసి కుల సంఘ అఖిల పక్ష నాయకుల అందరూ ఈ సమావేశం హాజరై జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో అమలాపురం పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు వాడరేవు వీంబాబు, రాజమహేంద్రవరం పార్లమెంట్ బీసీ అధ్యక్షులు పితాని శివ రామ కృష్ణ, బిసి సాధకార పెరిక కుల రాష్ట్ర అధ్యక్షులు వనపర్తి బద్రి, కాకినాడ పార్లమెంట్ బిసి సెల్ ప్రధాన కార్యదర్శి కొల్లుబోయిన శ్రీనివాస్, కాకినాడ సిటీ నియోజ కవర్గ బీసీ అధ్యక్షులు ఒమ్మి బాలాజీ, చీకట్ల వెంకటేష్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-మండపేట

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన పెంచుకోవాలని మండపేట అగ్రిప్రమాపక అధికారి జె. హనుమంతరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని ఏడిద రోడ్డు కోస్టల్ ఫోమ్ ఫ్యాక్టరీ ఆవరణలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ చేసి చూపించారు. హనుమంతరావు మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ వరకూ అగ్నిమాపక వారోత్సవాలు జరుగుతాయన్నారు. వాటిలో భాగంగా ప్రజలందరికీ అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం ప్రథమ అగ్ని నివారణ ఉపకారణాలు ఎలా వినియోగించాలి తదితర విషయాలపై ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులకు వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది వి.సుబ్రహ్మణ్యం, పిఎస్ వెంకటరెడ్డి, ఎవి.ప్రసాద్, పివై.సుధాకర్, జిజిఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

నురగతో మంటలను అదుపు చేయడాన్ని వివరిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

వైసిపి పాలనలో దళితులపై పెరిగిన దాడులు

ప్రజాశక్తి - ఆలమూరు

వైసిపి పాలనలో రాష్ట్రంలో అనేక చోట్ల దళితులపై దాడులు పెరిగాయని టిడిపి రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి, దళిత నాయకురాలు దండంగి మమత విమర్శించారు. చింతలూరు ఆమె క్యాంప్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ అధికార పార్టీ నేతలు, కార్యకర్తలు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నారా లోకేష్ దళితులను అవమానించారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. గతంలో లోకేష్ పై ఇటువంటి ఎన్నో ఆరోపణలు ప్రచారాలు చేసిన సంగతి ప్రజలు మర్చిపోలేదని అన్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ నేతలు తప్పుడు ప్రచా రాన్ని కట్టిపెట్టి లోకేష్‌కు క్షమాపణ చెప్పాలని మమత డిమాండ్ చేశారు.

నాగార్జున టెక్నికల్ సొసైటీ
శంకరాపురం, నిడదవోలు మండలం, తూర్పుగోదావరి జిల్లా

నిడదవోలు, 18-4-2023

శంకరాపురం, నిడదవోలు మండలం, తూర్పుగోదావరి జిల్లాలో కల నాగార్జున టెక్నికల్ సొసైటీకి చెందిన బ్యాచులర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (B.Ed) నందు అడ్మిషన్లు లేనందున (2021 నుండి 2023 వరకు) మూసివేయడమైనది.

ఇట్లు:
మేనేజ్‌మెంట్

యానాం వార్తలు

రెండు కరోనా కేసుల నమోదు

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజవర్గంలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం 104 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా రెండు కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదు అయినట్లు ఆరోగ్యశాఖ అధికారి టి రవిశంకర్ తెలిపారు. కరోనా కేసులు పెరుగుతున్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,తప్పనిసరిగా మాస్కులు ధరించాలని సూచించారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

నీటిని పొదుపుగా వాడుకోవాలని,వధా చేయకుండా వినియోగించుకోవాలని ఆర్ఎఒ మునిస్వామి ప్రజలకు సూచించారు. ఈ మేరకు బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా నీటిని పొదుపుగా వాడుకోవాలని ఇల్లు కట్టుటకు,వాహనాలు, పశువులు కడగడానికి నీటిని ఉపయోగించరాదని కోరారు. ధవళేశ్వరం నుండి యానాంకు నీటిని విడుదల చేయడానికి చర్యలు చేపట్టామని, పిల్లంక కాలువ వద్ద క్రాస్ బండ్ ఏర్పాటుచేసి నీటిని మళ్లించి యానాం చెరువులు నింపుతామని తెలిపారు. నీటి ఎద్దడి సమస్యపై ధవళేశ్వరం సూపరింటెంట్ ఇంజనీరు, కాకినాడ కలెక్టర్‌తో మాట్లాడినట్లు తెలిపారు. తాగునీటి కొరత కారణంగా ప్రస్తుతం ఇస్తున్న నీటి సమయాన్ని తగ్గిస్తున్నట్లు తెలిపారు. దీనికి ప్రజల సహకరించాలని కోరారు.

రామలింగేశ్వర రావు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

రామలింగేశ్వరరావు కాంస్య విగ్రహావిష్కరణ

ప్రముఖ వ్యాపారవేత్త కీ.శే. గాజుల వెంకట సూర్య రామలింగేశ్వరరావు సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం రామలింగేశ్వరరావు జయంతి సందర్భంగా యానాం బైపాస్‌లో ఉన్న శ్రీ పెద్దిరెడ్డి కృష్ణ వినాయకరావు యానాం కాపు కళ్యాణ మండప ఆవరణలో ఏర్పాటుచేసిన కాంస్య విగ్రహాన్ని అన్యం రామకృష్ణారావు ఆవిష్కరించారు. కాపు సంఘం అధ్యక్షులు కాటం శెట్టి వెంకట రామ్మూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు పట్టణ ప్రముఖులు రామలింగేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రామలింగేశ్వరరావు తనయుడు గాజుల బ్రహ్మానందం తన తండ్రిని ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో హంసాని రామలక్ష్మణుడు, దవులూరి సుబ్రహ్మణ్యేశ్వర రావు, మంగ సత్యనారాయణ, తోట వినోద్ కుమార్, ఉంగరాల వెంకటేశ్వరరావు, కవల గణపతి, చెక్కపల్లి లక్ష్మీబాయి, విల్లా చిన్ని,నల్లం నాగబాబు, గాజుల బ్రహ్మానందం కుటుంబ సభ్యులు, కాపు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ముస్లింలతో సుధా భూషణం, మల్లాడి శామ్యూల్, గూటం శివ గణేష్

ముస్లిములకు ఇఫ్తార్ విందు

ఎన్ ఆర్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ కార్యదర్శి సుధా భూషణం రంజాన్ పండుగ పురస్కరించుకుని స్థానిక జామియా మసీదులో బుధవారం సాయంత్రం ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, రిటైర్డ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గూటం శివ గణేష్, మసీదు నిర్వాహకులు,యువకులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

నా క్లయింటు తూ॥గో॥జిల్లా, సీతానగరం మండలం, వంగలపూడి గ్రామ కాపురస్తురాలు అయిన **శ్రీమతి కొంచ గీతాదేవి** నాకు ఇచ్చిన సంజాయిషీపై ఈ ప్రకటన జారీ చేయడమైనది. నా క్లయింటు యొక్క లింకు దస్తావేజు అయిన పిడింగొయ్యి సబ్ రిజిస్ట్రర్‌లో ది. 12-09-2019 రిజిస్ట్రరీ కాబడిన **క్రయ దస్తావేజు నెం. 6076/2019** రును లోను నిమిత్తం జిరాక్స్ తీసుకొనుటకు వంగలపూడి నుండి సీతానగరం ఆటోలో ది. 16-04-2023న ఉదయం సుమారు 10.30 గం॥ల సమయంలో ప్రయాణిస్తుండగా దారిలో పడిపోయినవి. నా క్లయింటు ఎంత వెదికిననూ దొరకలేదు. కావునా సదరు లింకు దస్తావేజు ఎవరికైననూ దొరికినచో నాకు గానీ, నా క్లయింటుకు గానీ ఈ ప్రకటన వెలువడిన మూడు రోజులలో తెలియజేయవలసినదిగా కోరడమైనది.

నాళం లక్ష్మణరావు, అడ్వకేట్
డోరు నెం. 2-140, వెలంపేట,
సీతానగరం. సెల్: 9490646441

మహారాజశ్రీ అమలాపురం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 240/2021

Between:
Smt. Grandhi Peda Lova, W/o. Nukaraju, Hindu, age 35 years, House-wife, D.No. 1-106 (Near) Market, Machavaram (PO), Ambajipeta Mandal, Dr. B.R.A.Konaseema Dt., ...Plaintiff
AND
Sri. Kudupudi Venkata Lakshmi, W/o. Srinivasa Rao, Hindu, age 49 years, House-wife, H.No. 3/4, Flat No.5, Santhi Nagar, Vanasthalipuram, HYD-74. ...Defendant

పై నెంబరు దావాలో ప్రతివాదికి దావా సమనులు అమలు నిమిత్తం **ది. 28-04-2023 సం॥ వాయిదా అయి యున్నది.** కనుక ప్రతివాది వాయిదాకు **ఉదయం 10.30 గం॥** లగాయతు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలియపర్చ వలయును. లేనియెడల ప్రతివాది పరోక్షమున తీర్మానించబడును.

అమలాపురం **వంక రామకృష్ణ విద్యాశంకరం**
19-4-2023 వాది ప్లీడరు, అమలాపురం

మహారాజశ్రీ అమలాపురం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 242/2021

Between:
Smt. Ari Venkata Lakshmi, W/o. Veeranna, Hindu, age 40 years, House-wife, D.No. 1-177/2, Vasamsettivari palem, Machavaram, Ambajipeta Mandal, Dr. B.R.A.Konaseema Dist., ...Plaintiff
AND
Sri. Kudupudi Venkata Lakshmi, W/o. Srinivasa Rao, Hindu, age 49 years, House-wife, H.No. 3/4, Flat No.5, Santhi Nagar, Vanasthalipuram, HYD-74. ...Defendant

పై నెంబరు దావాలో ప్రతివాదికి దావా సమనులు అమలుకు గాను **ది. 28-04-2023 సం॥ వాయిదా అయి యున్నది.** కనుక ఈ నెంబరు ప్రతివాది వాయిదాకు **ఉదయం 10.30 గం॥** లగాయతు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలియపర్చవలయును. లేనియెడల ప్రతివాది పరోక్షమున తీర్మానించబడును.

అమలాపురం **వంక రామకృష్ణ విద్యాశంకరం**
19-4-2023 వాది అడ్వకేటు, అమలాపురం